501108701

# ప్రబోధ 27

విశ్వహృదయమందు వినిపించు ప్రణవంబు
వినుడు శ్రద్ధతోడ వీనులలర
కామ్యముక్తులనిడ కల్పకంబిదె సుమన్న
మరువబోకు మిట్టి మంచిమాట.

వేదానాం సామవేదోస్మి. వేదములయందు సామవేదమును నేనే అని గీతాచార్యుడు ప్రకటించాడు. సామ్న ఉద్గీథో రసః అన్నది ఛాందోగ్యోపనిషత్తు. సామవేదమునందు రసస్వరూపమై, ప్రేమస్వరూపమై, దివ్యస్వరూపమై ప్రకటితమవుతున్నది యీ సామవేదము. ఉద్గీథమనగా ప్రణవము. సామవేదమునకు ప్రణవమే రసము. ప్రణవమే ప్రాణము.

ఓంకారం సర్వవేదానాం సర్వవేదములయందు ఓంకారము ప్రధానమైనదని శ్రుతి ప్రకటితం చేసింది. దానిని బట్టి ఓంకారమనేది యెంత ఉత్కృష్టమైనది, ఎంత పవిత్రమైనది ఎంత ప్రధానమైనది అర్థం చేసుకోవాలి. అక్షరప్రపంచమందు ఏకాక్షరమైన ఓంకారమే సర్వాక్షరములను నిరూపింపజేస్తున్నది. ప్రణవము పరమాత్మని యొక్క పర్యాయపదము. ఇట్టి ప్రణవస్వరూపమైనదే సామవేదము. సామవేదమును వ్యాసుడు జైమినీ మహర్షికి మొదట బోధించాడు. అతడు తన శిష్యులకు, ఆ శిష్యులు తమ శిష్యులకు యీ శిష్యపరంపరగా అభివృద్ధిగాంచి యిది యనేక శాఖలుగా రూపొందింది. సహస్రశాఖలుగా వెలసిన యీ సామవేదము నేటికి కాలగర్భములో కలసిపోయి కడకు మూడు శాఖలు మాత్రమే నిలచివున్నాయి. కౌథుమ అనేది ఒక శాఖ. రాణాయని అనేది రెండవ శాఖ. జైమిని అనేది మూడవ శాఖ. ఈ కౌథుమ అనే శాఖ యీనాడు గుజరాత్‌లో నాగర బ్రాహ్మణులయందు మిగిలివుంటున్నది. రాణాయని అనే శాఖ మహారాష్ట్రమునందు మిగిలివుంటున్నది. ఇంక మిగిలినది జైమినీ శాఖ. ఇది కర్ణాటక రాజ్యములో ప్రకటితము గావించుతున్నది. ఈ కౌథుమ, రాణాయని యీ రెండు శాఖల లోపల యెక్కువ భేదములు కన్పించవు. హా, ఉ, రా, ని అనే పదమునకు యిది కౌథుమ శాఖ వల్లిస్తే, రాణాయని అనే శాఖ ఆ ఆ ఊ రా. నీ.. అని అన్నింటికి దీర్ఘము నిస్తూవస్తుంది. దీర్ఘములతో కూడినది రాణాయని. కొన్నింటికి మాత్రమే దీర్ఘము నిచ్చి మరి కొన్నింటికి స్వల్పముగా పలికేది కౌథుమని. ఇది చిన్న శాఖయే అయినప్పటికి ప్రధానమైనది. ఇది రెండు విధములుగా వుంటున్నది. ఆర్చిక, గానము అని రెండు విధములు. ఈ గానములోపల నాలుగు విధములుంటున్నవి. గ్రామేణగానము, అరణ్యకగానము అనగా అరణ్యమునందు గానము చేసేది. మూడవది ఊహాగానము. నాల్గవది ఊహ్యగానము.

501108702

ఈ పల్లెలయందు పూర్వకాలము నిత్యజీవితము లోపల పర్వదినములయందేకాక మిగిలిన దినములయందు కూడను పంటలయందు, కోలాటములయందు గొబ్బెళ్లయందు, కలుపులయందు, కోతలయందు యీ గానములను పాడుతూ ఆనందాన్ని అనుభవించేవారు. అరణ్యగానము. అరణ్యగానము లోపల పశువులను మేపుకుంటూ నిర్భయముగా కంఠము నెత్తి పాడుకుంటూ యీ యొక్క కాలమును ఆనందముగా అనుభవిస్తూ వచ్చేవారు. ఈ అరణ్యములయందు కేవలము సహజమైన శబ్దమునే శృతిగా భావించుకొని యీ యొక్క చెట్లనే, రాళ్లనే ఒక తాళముగా విశ్వసించుకొని అడవులయందు స్వేచ్ఛగా తామ భగవంతుని గానములను చేసేవారు. నాల్గవది ఊహాగానము. ఇవి యీనాటి సినిమా గానములు. సినిమాలో యేడుస్తూ వుండినట్లుగా వూహించి యీ యేడుపు పాటలలోపల యుక్ యుక్.. అన్నట్లుగా కొన్ని యేడుపులు ప్రకటింపచేసే ప్రదర్శిస్తూ వుంటుంటాయి. నిజముగా యేడుపు లేదు. ఏడుపుగా వూహించి యేడ్చినట్లుగా విన్పించే రీతిగా మననము చేయుటము. నవ్వినట్లుగా వూహించి, అది కేవలం కృత్రిమమైన నవ్వుగా యితరులకు ప్రకటితం చేసేది. ఉద్రేకించినట్లుగా వూహించి, ఆ వుద్రేకము పరులపైన ప్రకటింపచేసేది. నిజముగా ఏడుపుగాని, ఉద్రేకముగాని, నవ్వుగాని లేదు. కేవలము ఊహాగానములే. ఊహాగానమదూ తాను అనుభవించి, తాను తాదాత్మ్యభావమును పొంది, తాను ఆనందించి తద్వారా యితరులకు కూడను ఆనందపరచే గానములు. ఈ నాల్గువిధములైన గానములను యీ సామవేదము ప్రపంచమునకందించింది.

వీటన్నింటికి ప్రధానమైనది ప్రణవము. ప్రణవము లేని స్థానము లేదు. ప్రణవము వినని కాలము లేదు. ఒక్క క్షణమైనను ప్రణవమును విడచి వుండలేము. ప్రతి జీవి యొక్క గళమునందు కూడను ప్రణవమే వుంటున్నది. సర్వత్రా వున్నది ప్రణవమే. సర్వశబ్దములకును ప్రణవమే మూలము. అట్టి ప్రణవస్వరూపమే బ్రహ్మమని నిరూపించింది. కనుక దీనినే యేకాక్షరం బ్రహ్మ అన్నారు. ఆ యేకాక్షరం ఓం. ఏకాక్షరం బ్రహ్మ. ఓం అనేదే బ్రహ్మస్వరూపము. ఆ ఒక్క అక్షరమే బ్రహ్మస్వరూపమన్నాది. ఏతావాతా ఓం అనేది బ్రహ్మమనేది పర్యాయపదములే కాని రెండును ఒక్కటే. అభేదమైనవి. ఓం యెట్లు సర్వవ్యాపితమైనదో, సర్వత్రా నిండి వున్నదో అదేవిధముగనే బ్రహ్మ కూడను సర్వత్రా నిండి, సర్వవ్యాపకుడై వుంటున్నాడనే సత్యాన్ని మనం గుర్తించాలి. ఇది యీవిధముగా నుండగా అయమాత్మా బ్రహ్మ అనేది మరొక పదము వచ్చింది. ఈ ఆత్మ అనేది కూడను బ్రహ్మస్వరూపమే. కనుక ఓం, బ్రహ్మ, ఆత్మ యీ మూడు కూడను అభేదస్వరూపములే. ప్రతి మానవుడు నిత్యజీవితములోపల నాల్గు అవస్థలు అనుభవిస్తూ వస్తున్నాడు.

అవి స్వప్న, జాగ్రత్, సుషుప్తి, తురీయము. జాగ్రత్ అనగా దృశ్యకల్పితమైన యీ జగత్తంతయు పంచభూతములతో, పంచప్రాణములతో, శరీరముతో, అంతఃకరణముతో కూడినది. మనస్సు బుద్ధి, చిత్తము, అహంకారము. ఈ 19 ముఖములతో కూడి వుంటున్నాది. దీనికి ఐదు కోశములు కూడా యున్నారు. ఇరవై నాల్గు తత్త్వములతో కూడినదే యీ దృశ్యకల్పితమైన ప్రపంచము. అనగా జాగ్రదవస్థయందు స్థూలముగా దృశ్యస్వరూపమై వుంటున్నాది. ఆత్మ లేక యీ జగత్తు కాని, స్థూలముగాని అనుభవించుటకు వీలుకాదు. కనుకనే యీ ఆత్మకు విష్ణుడు అని పేరు పెట్టారు. ఇంతియే కాక సర్వులయొక్క వుదర

50110870З

మునందు కూడను అన్నింటిని భస్మము గావించి, అన్నింటినీ కాపాడి అగ్నిహోత్రునిగా నిలచి యీయొక్క వైశ్వానరునకు కూడను ఆత్మ అని పేరు పెట్టారు. విష్ణుడనియు, వైశ్వానరుడనియు, విరాట్స్వరూపుడనియు కూడా వీనికి పేరు పెట్టారు. అనగా అనేక రూప నామములతో కూడినవే యీ విరాట్స్వరూపము. కృష్ణుడు అర్జునునకు విరాట్స్వరూపం చూపినాడంటే యేమిటి? సర్వత్రా సర్వకాలములయందు సర్వస్థితులయందు తానుయీ రూపాన్ని ధరించి వున్నాడనే యీ సత్యాన్ని నిరూపించటమే. ప్రపంచమంతయు కూడను భగవంతుని యొక్క విశ్వస్వరూపమే. దీనినే విరాటుడు అని కూడను పిలుస్తు వచ్చారు. విరాటుస్వరూపమునందు ఆత్మ జాగ్రదవస్థలో స్థూలరూపమును ధరించి వుంటున్నది. అదియే స్వప్నావస్థయందు సూక్ష్మరూపమును ధరించి వుంటున్నాది. ఈ జాగ్రదవస్థయందు అనేక యింద్రియములతో కూడిన యీ యొక్క ఆత్మ అంతర్ముఖముగా నిలచి తనకు తానే సంకల్పించుకొని ఏకోహం బహుస్యాం అన్నట్లుగా తనకు తాను సంకల్పించుకొని అనేక రూపములను, అనేక స్థితులను తాను అనుభవించినట్లుగా నిరూపించింది.

ఈ స్వప్నమునందు రూపము గాని రూపములు, శబ్దము గాని శబ్దములు తిండి గాని తిండి యిలాంటి విసృష్టించుకుంటూ వున్నాది. పరిమితముగా కూడ వుంటున్నాది. ఈ సృష్టి ఆ స్వప్నావస్థకు మాత్రమే పరిమితము కాని తిరిగి మరొక అవస్థకు పరిమితం కాదు. తిరిగి వ్యాపించదు. కాని తనకు తానే సర్వమూ సృష్టించుకుని తనకు తానే భీతిని, ఆనందాన్ని అనేకవిధములైన కష్టములను, నష్టములను, సుఖములను దుఃఖములను అనుభవిస్తూ వుంటుండాది. అన్నింటికిని ఆత్మనే కారణము. గదిలోపల పదిమంది పరుండి నారంటే, పదిమందికి పదివిధములైన స్వప్నములు రావచ్చునే కాని ఒక స్వప్నమునకు, మరొక స్వప్నమునకు యేమాత్రము సంబంధముండదు. అనగా తనయొక్క భావముల చేతనే తాను సృష్టించుకొని ఒక పరిమితమైన అవస్థను అనుభవిస్తూ వుంటాడు స్వప్నావస్థయందు. అక్కడ యేది వీటిఅన్నిటికి మూలాధారము ఒక వెలుగు వుంటున్నాది. ఈ వెలుగునకే తేజస్సు అన్నారు. తేజస్వరూపుడైన ఆత్మకే తైజసుడు అని పేరు పెట్టారు. స్వప్నావస్థయందు తైజస్వరూపకంగా వుంటున్నది ఆత్మ.

ఒక చిన్న ఉదాహరణము. మనము స్వప్నము వరకు పోనక్కరలేదు. మీరు కన్నులు గట్టిగా మూసుకుని యేమి చూస్తున్నామని విచారణ చేస్తే యేమి కన్పించటంలేదు. పెద్ద చీకటిగా కన్పిస్తున్నాది అంటాము. అయితే యీ చీకటిని చూస్తున్నది యెవరు. ఎవరు అక్కడ చూడకుండిన యిది చీకటి అని యెట్లు నిర్ణయించగలము. కనుక కన్నులు మూసుకున్నప్పటికిని ఎవరో ఒకరు అక్కడ చూస్తూ వుండటం చేతనే చీకటిగా వున్నది నల్లగా వుంటున్నది అనటమును చూసేవారు ఎవరో ఒకరున్నారు. ఆ చీకటిని చూచేవారెవరో ఒకరున్నారు. అతడే తేజస్వరూపుడు. తైజసస్వరూపములో స్వప్నావస్థలో వుండినవాడే అంతఃకరణయందు సూక్ష్మరూపమును ధరించి వుంటున్నాడు.

ఇంక మూడవది సుషుప్తి. అనగా మంచి నిద్ర. జాగ్రత్త గాని స్వప్నము గాని యేమాత్రము లేవు. ఇందులో కల్పన గాని సృష్టి గాని యేమాత్రము కన్పించవు. సర్వేంద్రియములు కూడను మనసులో

501108704.

లీనమై పోయినవి. ఇక్కడ కేవలం ప్రజ్ఞ మాత్రమే నిలచి వుంటుంది. ఈ ప్రజ్ఞచేతనే తాను వున్నట్లుగా వునికిని గుర్తిస్తూ వుంటాడు. ఆనందమును తదుపరి అనుభవిస్తూ వుంటుంటాడు. సర్వేంద్రియములు కూడను స్తంభించి వుంటుంటాయి. ఉఛ్ఛ్వాస నిశ్వాస స్వరూపములో పల ప్రజ్ఞాపాత్రుడైన పరమాత్ముడు అనుభవిస్తుంటాడు. ప్రజ్ఞ స్వరూపుడే బ్రహ్మ కనుక ప్రజ్ఞానం బ్రహ్మ అని తెలుపుతూ వచ్చింది. ఈ యొక్క ప్రజ్ఞకే మనము నిరంతరము వుండిన తెలివి తేటలు శాశ్వతమైన ఆనందము అని దీనిని నిరూపిస్తూ వచ్చారు. ఈ ప్రజ్ఞనే జాగ్రదవస్థయందు శరీరమునందును ఇంద్రియములతో కూడిన అంతఃకరణాయందును, ఆత్మయందును సమత్వముగా వుండటంచేత దీనికి constant Integrated awareness అన్నారు. ఈ ప్రజ్ఞా స్వరూపుడుగా వుండటంచేత అతనికి ప్రాజ్ఞుడు అని పేరు పెట్టారు. కనుక ప్రాజ్ఞుడు అనేది కేవలం ఒక బ్రహ్మస్వరూపువే. అదే ఆత్మస్వరూపము. ఈ బ్రహ్మస్వరూపంగాని, ఆత్మస్వరూపంగాని గోచరం కావటం లేదే అని మనము సందేహించవచ్చును అక్కడ కూడను ప్రణవ స్వరూపమనేది వుండటంచేత యీ బ్రహ్మ, ఆత్మ స్వరూపములు అభిన్నముగా వుంటున్నాయి. ప్రణవము యే రీతిగా మనకు కనిపిస్తున్నాది. వినిపిస్తున్నాది. ప్రణావము కన్పించేది కాదు. భక్తిని తినిపించేది. ఓంకారము వినిప్పించేది. ఈ కన్పించే జగత్తుగాని, విన్పించే శబ్దముగాని, అనిపించే మాటలుకాని, అనుభవింపచేసే హృదయముగాని యివన్నియు యీ ప్రణవములోనే లీనమైవుంటున్నవి. ఈ గాఢ నిద్రయందు, సుషుప్తియందు కూడను మన ఉఛ్ఛ్వాస నిశ్వాసములు జరుగుతే వుంటున్నవి. ఈ ఉఛ్ఛ్వాస నిశ్వాస స్వరూపుడైనవాడే ఓంకారస్వరూపుడు. కనుక యీ ఓంకారమనేది యీ బ్రహ్మస్వరూపాన్ని, ఆత్మస్వరూపాన్ని ప్రకటితంగా విస్తూ వస్తున్నది. సృష్టి అంతయు ఓంకారముతోనే నిండి వున్నది. అందువలననే యీ సుషుప్తియందు కూడను ప్రాజ్ఞ స్వరూపుడై వుండటంచేత యిందులో ఆత్మ సాక్షాత్కారించి నట్లుగా నిరూపిస్తూ వున్నది.

నాల్గవది తురీయము. తురీయావస్థ అనగా నాల్గవ స్థానమని అర్థము. ఇది యేమిటి. ఇది యే విధమైన స్వరూపముతో వుండి వుంటుంది. ఇది సర్వమును లీనము గావించుకొని కేవలము పూర్ణానందాన్ని అనుభవిస్తుంటాది. ఆనంద స్వరూపమును ధరించి వుంటుంది. అద్వైతానందముతో కూడి వుంటుంది. వర్ణనాతీతమైన స్థితిలో వుంటుంది. అనగా జాగ్రత్, స్వప్న, సుషుప్తి తురీయములు ఆత్మకు నాల్గు పాదములుగా భావిస్తూ వచ్చారు. అదే విధముగా ఓంకారమునకు కూడను నాల్గు పాదములుంటున్నవి. అకార, ఉకార, మకార యింక తురీయావస్థలో వున్నది అధిరతము. అధిరత మనగా యేమిటి? అకార, ఉకార, మకారము కూడిన తక్షణమే యేర్పడు ధ్వనికే యీ అధిరత అంటారు. అకారమనేది ఓంకారమునకు మొదటి ధ్వని. ఈ శబ్ద ప్రపంచమునకు అది ప్రధానమైన మూలాధారము. శబ్ద తరంగములలోపల అది ప్రధానమైనది. ఇది అన్ని అక్షరములకు మొదటి స్థానమునకు కూడినది. ఇది జాగ్రదవస్థతో కూడిన విరాట్ స్వరూపుడుగా విశ్వసిస్తూ వచ్చింది. ఇతనే విష్ణువుగా రూపొందుతుంది. జాగ్రత్ ప్రపంచమునకు అకారము మూలాధారము. ఇది విరాట్ స్వరూపుని యొక్క సన్నిహిత సంబంధము. ఇంక స్వప్నావస్థయందు వున్న ఉకారము, ఉకారము. ఈ ఉకారము అనేది ఓంకారములో

501108705

రెండవధ్వని. ఈ ఉకారతత్త్వమనేది తేజస్స్వరూపాన్ని ధరించి వుంటుంది. సర్వస్వమును ప్రకటింపచేస్తుంది. దీనికి అంధకారమనే పేలేదు. మకారము యీ ఓంకారములో మూడవ అక్షరము. సూత్రస్థానమును ప్రకటిస్తూవస్తుంది. సర్వులయందునువున్న అంతర్భావమును ప్రకటింపచేస్తూవస్తుంది. సూత్రప్రాయుడని దీనికి మరొకపేరు. అంతర్యామి అనియు మరొకపేరు. అనగా యేమిటి! సూత్రములయందు దారము ఏకంగా చేరినట్లు ప్రతి జీవునియందు యీమకారమనే సూత్రము సర్వత్రా చేరివుంటున్నది. అందువలననే యితనికి సూత్రాత్ముడనికూడను మరొకపేరు. ఇతనికి రూపములేదు. అలాంటి తత్త్వాన్ని నిరూపిస్తూవస్తుంది యీమకారము.

అకార, ఉకార మకారములు చేరినతరువాత ఒకధ్వని వినిపిస్తుంది. ఇదియే యీయొక్క తురీయావస్థకు సంబంధించినది. ఇదియే ఓంకారము. కనుక అకార, ఉకార, మకారములతో కూడిన ఓంకారమునకు నాల్గుపాదములు. కనుక ఆత్మకు, బ్రహ్మకు, యీ ఓంకారమునకు నాల్గు పాదములున్నవి. కనుక చతుర్ముఖుడు బ్రహ్మ అని నిరూపిస్తూవచ్చింది. దానినే శబ్దబ్రహ్మమని కూడను నిరూపిస్తూవచ్చాయి. శబ్దబ్రహ్మమనందే గానబ్రహ్మలీనమై వుంటుంది. దీనికి యనేకవిధములైన వర్ణనలు కూడను చేస్తూవచ్చింది. ఇతని యొక్క అష్టగుణములలోపల ప్రధానమైనది యీ శబ్దబ్రహ్మము. శబ్దబ్రహ్మము ఒకదానిలో నిలచినది కాదు. సర్వత్రా వ్యాపించినది. శబ్దబ్రహ్మమయి, చరాచరమయి, జ్యోతిర్మయి, వాఙ్మయి, నిత్యానందమయి, పరాత్పరమయి, మాయామయి, శ్రీమయి అని దీనికి అష్టసంబంధమైన శక్తులు కల్గినటువంటిది. ఇలాంటి ఓంకారతత్త్వమును ప్రతిహృదయమునందు ప్రతిష్ఠింప చేసుకుని తాను, తన శబ్దము, తనవాక్కు, తనదృష్టి సర్వము ప్రణవనాదమే అనేసత్యాన్ని మనము గుర్తించినప్పుడే ఈ సామవేదమును గుర్తించినవారమౌతాము. సామవేదములోని యీ ప్రణవనాదమును చక్కగా అర్థము చేసుకున్న వ్యక్తులు మాత్రమే తత్త్వజ్ఞులు కాగలరు. ఇందున్న తత్త్వాన్ని గుర్తించుకొనక యేదో బాహ్యమైన సాధనలచేత మనము యీ తత్త్వజ్ఞానాన్ని పొందలేము.

ఇంట జ్యోతి వెలుగుచునుండ
పొరుగు యింటికి అగ్గి అడగనేల

ఇక్కడే జగత్ స్వరూపుడైన ప్రణవస్వరూపుడు వుండగా, బాహ్యసంబంధమైన ఆచారములుగాని, విచారములుగాని, సాధనలుగాని యెందుకు. ఇట్టి సర్వశక్తిమయుడు, సర్వవ్యాపకుడు అయిన భగవంతుడు శబ్దస్వరూపుడై నాయందు వుంటున్నాడు ప్రణవాకారములో అనే విశ్వాసమును మనము పెంచుకోవాలి. కనుకనే యీవిధమైన ప్రణవమును అపవిత్రముగా వించనుండా వుండేనిమిత్తమై అధికశబ్దముచేత, అధికమాటలచేత యీ ప్రణవాకారశక్తిని మనము వ్యర్థముగా వించరాదని చెప్పింది. చూచినప్పటికి ప్రణవాకారమే. విన్నప్పటికి ప్రణవాకారమే. చెప్పినప్పటికి ప్రణవాకారమే. కనుకనే చెడ్డ చూడరాదు. తానెప్పుడు వినగరాదు విశ్వమందు. మూడుకోతులుగల మూర్తిని చూడరా.

ఒకటి చెవులు మూసుకొని వుంటుంది. ఒకటి కన్నులు మూసుకొని వుంటుంది. ఒకటి నోరు మూసుకుని వుంటుంది. కోతులే యిట్టి మంచి మాటలు యనేక విధములుగా బోధనలు చేస్తున్నాయి. అతిభాష మాట్లాడవద్దు. ఈ ప్రణవనాదాన్ని వ్యర్థముగావించవద్దు. శ్రావ్యమైన శబ్దములు వినగల్గినయిట్టి మన చెవులు అపశబ్దమును వినటానికి యే మాత్రము అంగీకరింపవద్దని చెవులు మూసుకుంటాయి. పరదూషణగాని, పరులను హేళన చేయుటముగాని, పరులను నిందించటంగాని పరులను హాస్యాస్పదముగా చూచే పలుకులు కాని మన నోటినుండి రారాదు. కేవలము మన energy, energy అంటే అదే దైవశక్తి మనము వ్యర్థముగావించిన వారమవుతాము. ప్రణవస్వరూపమైన ఆ శబ్దమునే వ్యర్థముగావించినప్పుడు యీ జన్మము సార్థకమెట్లువుతుంది

అదే విధముగనే వినటంగాని, పలకటంగాని, చూడటంగాని మంచిది కాదు. చెడ్డవి. ఇవియు ముఖ్యమైన సాధనలోపల నిత్యజీవితములో మనము అభివృద్ధిపరచుకోవాలి. అనవసరమైన వారి విషయములో మనము ప్రవేశించరాదు. ఈ సత్యాన్ని తాను గుర్తించటానికి ప్రయత్నించాలి. ఇలాంటి నిజ తత్త్వమును, నిత్యజీవితములోపల సాధనకు అనుగుణ్యమైన మార్గములను ప్రబోధిస్తూ వచ్చింది యీ సామవేదము.

అన్నివేదములయందు యీ సామవేదము ఉత్కృష్టముగా భావిస్తూ వచ్చింది. కనుకనే అట్టి సామవేదస్వరూపుడు నేను అని కృష్ణపరమాత్ముడు చెప్పిన విషయము. వేదానాం సామవేదోస్మి. అనగా నేను సామవేదమును అని, వేదములలో నేను ప్రధానమైన స్థానమును వహించినానని కూడను గీతాచార్యుని యొక్క నుడివి. దైవత్వాన్ని, దివ్యత్వాన్ని, పవిత్రాన్ని ప్రకటితంగావించి, ప్రచారం సల్పి, ప్రబోధలు చేసి ఆనందాన్ని అందించేది యీ సామవేదము.

మన మాటలన్నియు కూడను కేవలము ఒక విధమైన హృదయానందాన్ని అందించేవిగా వుంటుండాలి. ఇతరులనే మాత్రము బాధింపచేసేవిగా వుండకూడదు. ఆ విధమైన మాటలలో మనం ప్రవేశపడితే మనం మనుషులమే కాదు. నీకిష్టము లేనప్పుడు యితరులయొక్క చింతనే నీవు మానేసేయి. అంతేకాని యిష్టము లేనివారి గురించి అనేకంగా నీవు మాట్లాడటం, వారిని పరిహాసించటం, వారిని నిందించటం, వారిని దూషించటము యిది మహాపాపమని నిరూపిస్తూ వచ్చింది యీ సామవేదము. మంత్రములు వల్లించినంత మాత్రమున ప్రయోజనము లేదు. నిత్యజీవితములోపల యేది అవసరమైన విషయములో అవి మనం వేదములనుండి గ్రహించాలి. మంత్రాలను ఉచ్ఛరించుకుంటూ, కాలమును వ్యర్థముగావించుకుంటూ, క్రియలో మనము ఆచరణ లేకుండా పోయినా యీ మంత్రములయొక్క ఫలితమునే మాత్రము కూడను అనుభవింపము. ఏదో గ్రామఫోను రికార్డులు వాయించినట్లుగా మనం మంత్రములు చెప్పవచ్చును. మానవుని యొక్క జీవితము ఒక యంత్రము ఒక మంత్రము ఒక తంత్రము. ఇలాంటి పవిత్రమైన జీవితములోపల దివ్యమైన వాణిని పవిత్రమార్గములో ప్రవేశపెట్టి జీవితాన్ని ధన్యముగావించుకోవాలి. ఇలాంటి

501108707

పవిత్రమైన వేదములు యే ఒకటొ రెండో మాత్రమే నాడు జగత్తులో వ్యాపించి వుంటున్నాయి. వాని రస స్వరూపమైన సారమును మనము గ్రోలి, తద్వారా తిరిగి క్షీణించుచున్న యీ వేదములను పునరుద్ధరింప చేయుటమే మన కర్తవ్యము. దీనికి మనము కంకణము కట్టుకొని సరైన మార్గములో ప్రవేశపెట్టాలి.

మానవ జీవితము ఉత్కృష్టమైనది, సౌజన్యమైనది, సౌశీల్యమైనది. ఇట్టి నిత్య జీవితములో 'జంతూనాం నరజన్మ దుర్లభం' దుర్లభమైన మానవ జన్మ యెత్తి కూడను సత్యమైన వాక్కులను మనమే మాత్రము శ్రవణము చేయక, విచారణ చేయక జీవితము నిరర్థకంగా వించుకొటం సరైన కర్మము కాదు. భగవంతునిపైన భక్తిని మనము అభివృద్ధి పరచుకోవాలి. భక్తియే లేకుండిన యీ విద్యలన్నికూడను నిరర్థకములే. మనము వుచ్చరించినంత మాత్రమున ప్రయోజనము లేదు. దైవ భక్తిని మనం పెంచుకోవాలి. మనకు కావలసినవంతా గంట కొట్టినట్లుగా కంఠముతో అనవచ్చును. కాదు. కాదు నాదము రావాలి. నాదమునే వేదముగా భావించాలి. నాదములో లీనముగావాలి. అదియే మనయొక్క సమాధి. ఆసమత్వాన్ని మనము భావించాలి. సమత్వాన్ని పెంచుకోవాలి. సమత్వాన్ని పంచుకోవాలి. అదియే మానవుని యొక్క ప్రధానమైన కర్తవ్యము.

ప్రేమస్వరూపులారా! ప్రధానముగా మానవునిలో వుండవలసినవి రెండు లక్షణములు భక్తి, త్యాగము. త్యాగము లేనిదే భక్తి రాదు. దీనినే న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసుః కాబట్టి యీ అమృతత్వాన్ని అనుభవించాలంటే త్యాగము, త్యాగము----. స్వార్థము, స్వప్రయోజనము యీ రెండింటి ద్వారానే మానవుడు బంధింపబడుతున్నాడు. స్వార్థమును యెప్పుడు నీవు విడచిపెడతావో అప్పుడే బంధము వుండదు. ప్రాణము క్షణభంగురము, కరగిపోయే మంచు వంటిది. మన ఆస్తులన్నియు కూడను కదలిపోయే మేఘముల వంటివి. వీటి నిమిత్తమై మనము యీ విధమైన శ్రమలు పడి కట్టుకడపటికి దివ్యమైన జీవితాన్ని నీవు వ్యర్థముగా వించుకోవద్దు. ఏ సేవయందైనా కూడను నీవు త్యాగము పూని పరులకు సేవ చేసి సమాజాన్ని మెప్పించి సమాజము యొక్క ఆనందాన్ని అనుభవించే వ్యక్తిగా నీవు తయారు కావాలి. ఎంత కాలమైనా ఉద్యోగము, ఉద్యోగము... ఏమిటి యోగము లేని ఉద్యోగము. నీకు కుటుంబము వుంది. నీకు ఒక విధమైన బాధ్యత వుంది. కర్తవ్యము వుంది. ఉద్యోగం చేసుకోవచ్చు. కాని అవసరమైనప్పుడు వుద్యోగమునైనా త్యాగము చేసి దేశము యొక్క సేవలో పలమనం పాల్గొనాలి. అన్నీ వదలిపెడితే నా సంసారాన్ని చూచే వారెవరు. అంత విశ్వాసమే లేకపోతే నీ సంసారమెట్లా బాగుపడుతుంది? నారు పోసినవాడు నీరు పొయ్యడా.

పుస్తకముల్ పఠించితి పూర్తిగ చూచితి సర్వశాస్త్రముల్
నిస్తులమైన విద్యలు నేర్చితి నంచును గర్వమేలనీ
హస్తయుగంబు మోడ్చి పరమాత్మను భక్తితో కొల్వలేని యీ
ప్రస్తుత విద్యలన్నియు నేటికి నిరర్థకంబులు మానవా.

కనుక మన విద్యలుగాని, మన ఆస్తిపాస్తులుగాని నిజముగా భగవత్ విశ్వాసమే లేకపోతే యివన్నియు

59108708

కూడను కేవలము భూమిలో మట్టి చేరినట్లుగా ఈ అవస్థలకు మనం గురియై పోతున్నాము. శ్రీమంతుడైనా కూడను ఈ దేహమును వదలి పోయే సమయం ఒక పిడికెడు మట్టైనా గొనిపోవటం లేదు. కాని పోయేవి రెండే రెండు. పుణ్యము, దైవానుగ్రహము. ధర్మము కీర్తిని మనము సాధించాలి. లోకములో జీవనం అస్థిరం. యవ్వనం, ధనము అస్థిరం. ధారాపుత్రాదులే అస్థిరం. ఇవన్నీ అస్థిరాలే. కీర్తి ఒకరి వలన వచ్చేది వంటిది గాదు. పరుల వల్ల పోయేది గాదు. మీరు అనుకోవచ్చును. మా వల్ల స్వామికి కీర్తి వచ్చిందని. మీ వల్లే కీర్తి రావచ్చును. మీ వల్లే కీర్తి పోవచ్చును. ఇది చాలా పొరపాటు. కీర్తి ఒకరి వల్ల వచ్చేది కాదు. ఒకరి వలన పోయేటువంటిది కాదు. అది నా నుండి వచ్చినదే. నా ఆనందం నా నుంచి వచ్చినదే. ఒకరి నుండి వచ్చినది కాదు. ప్రతీ మానవుడు తన కీర్తి అపకీర్తులు తన ప్రవర్తన నుంచే వచ్చినవి కాని ఇతరుల నుంచి వచ్చినవి కావు. దిగుమతి చేసుకున్నవి కావు. కనుక మనము సత్ప్రవర్తనను అభివృద్ధిపరచుకొని, సత్సంగములో చేరి సత్కర్మలు ఆచరించినప్పుడే మనకు సత్కీర్తి లభిస్తుంది. దుస్సంగము, దురాలోచనలు, దుర్భావములు, దుష్కర్మలు ఆచరిస్తుంటే మీకు కీర్తి యెట్లా వస్తుంది? అపకీర్తియేనీ యొక్క పట్టము. అందరితో చెడ్డ చెడ్డ అని బ్రతికే దానికంటె, పదిమందితో మంచి అనిపించుకొని చావటమే మంచిది. అయితే మానవుడు సర్వత్రవుండిన ప్రణవాకారాన్ని ధరించి ప్రణవశబ్దమునే ఉచ్ఛ్వాస నిశ్వాసములుగా విశ్వసించి అనుభవించే మానవుడు ఈ దుర్మార్గములో ప్రవేశించరాదు. సామవేదము చెప్పినవన్నీ యేమిటి! సర్వత్రా నిండినటువంటి పరమాత్ముడు నీయందు కూడను వుంటున్నాడు. శబ్దస్వరూపుడై వుంటున్నాడు. అతను లేని స్థానం లేదు. అతనిది కాని స్థానం లేదు అనే సత్యాన్ని మీరు విశ్వసించి, ఈ ప్రణవాన్ని ఉపాసనగా చూసి తద్వారా ఈ ప్రణవములో ఐక్యం కావాలని ఆశించి ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.